# బోయి భీమన్న సాహిత్యం - సమాలోచన

## అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

21 & 22, ఫిబ్రవరి 2022

# భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 18 - Issue. 2 - Spl. Edition - February 2022 - ISSN No. : 2456-4702



నిర్వహణ :

తెలుగు విభాగం

మద్రాసు విశ్వవిద్యాలయం

మెరినా ఆవరణ, చెన్నై, తమిళనాడు.

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | బోయిభీమన్న సాహిత్యం - భారత జాతీయ దృక్పథం | - ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు | 23 |
| 2. | రాగవాశిష్ఠం - సామాజిక చైతన్యం | - భీమవరపు వెంకటేష్ | 26 |
| 2. | ఋషివంటి భీమన్న రెండవ వ్యాసుడు | - డా॥. సిహెచ్. బాబావలిరావు | 29 |
| 3. | బొయి భీమన్న కవిత్వం - సామాజిక దృక్పథం | - బసవరాజప్ప | 34 |
| 4. | బోయిభీమన్న కవిత్వం - వర్ణ భేద రాహిత్యం | - సి.హెచ్. రాధాకృష్ణ | 37 |
| 5. | పాలేరు నాటకం - దళిత చైతన్యం | - డా॥. కె. చెన్నకేశవ రెడ్డి | 40 |
| 7. | 'గుడిసెలు కాలిపోతున్నై - సామాజిక దృక్పథం | - డా॥. జరుపుల రమేష్ | 43 |
| 8. | పాలేరు నాటకం - ప్రగత శీలదాయకం | - డా॥. వై.వి.సి.హెచ్ లీలాపద్మజ | 52 |
| 9. | డా॥ బోయిభీమన్న గారి సాహిత్యం - రసపోషణ | - డా॥. పులపర్తి శ్రీనివాసరావు | 56 |
| 10. | బోయి భీమన్నగారి 'కుల నిర్మూలన' - అనువాద నైపుణ్యం | - డా॥. యం. ప్రసాద్ | 60 |
| 11. | ఆధునిక దళిత మహాకవి - బోయి భీమన్న | - ఆచార్య ఎం.రామనాథం నాయుడు | 65 |
| 12. | తమస్సుపై దండయాత్ర - దీపసభ | - డా॥. టేకుమళ్ళ వెంకటప్పయ్య | 69 |
| 13. | భీమన్న 'త్రిపద'లు - హేతువాద గుళికలు | - డా॥. పి. జయచంద్రుడు | 73 |
| 14. | బోయిభీమన్న రచన 'ధర్మం కోసం పోరాటం' దళిత చైతన్యం | - కె. అనిల్ బాబు | 77 |
| 15. | బోయి భీమన్న 'ఉగాదులు' కవిత్వం - సామాజికత | - భూక్యా కాశీరామ్ | 80 |
| 16. | ఓటరు జాబితాపై భీమన్న స్వరం | - కోష్టు గోవిందరావు | 84 |
| 17. | రాగవాసిష్ఠం - నాటక వైశిష్ట్యం | - డా॥. బి. మల్లికార్జున రాజు | 89 |
| 18. | "మానవ వ్యక్తిత్వానికి మార్గదర్శకత్వం-డా॥. బోయి భీమన్న వచన కవిత్వం" | - మామిడి మౌనిక | 93 |
| 19. | కూలీరాజు నాటకం - సామాజిక చైతన్యం | - డా॥. జూరెడ్డి నిర్మల | 97 |
| 20. | బోయిభీమన్న సాహితీవ్యాసాలు - పురాణాలలో హరిజన మనీషులు.. | - రుద్రపాక జితేంద్ర కుమార్ | 101 |
| 21. | పాలేరు సాంఘిక నాటకం - పాత్రల వైశిష్ట్యం | - డా॥. గుమ్మడి రామలక్ష్మి | 104 |
| 22. | డా॥. బోయి భీమన్న సాహిత్యం - ఆదిమ గిరిజనుల దృక్పథం | - డా॥. సునావత్ రాంబాబు | 109 |
| 23. | బోయి భీమన్న గారి "పడిపోతున్న అడ్డుగోడలు" - సమసమాజ స్థాపన | - డా॥. జి. శైలమ్మ | 117 |
| 24. | నీవే మైనా చేయగలవు | - డా॥. యస్.సి. సంజీవ రెడ్డి | 122 |
| 25. | డా. బోయి భీమన్న 'అంబేడ్కరిజం' గ్రంథం - మౌలికాంశాలు | - డా॥. గిన్నారపు ఆదినారాయణ | 124 |
| 26. | రాగవాసిష్ఠం - పరిచయం | - డా॥. ఎ. ఆంబ్రూణి | 129 |
| 27. | బోయి భీమన్న కవిత్వం - హేతువాదం | - డా॥. దార్లపూడి శివరామకృష్ణ | 135 |
| 28. | "అకాండ తాండవం" కావ్యంలో బోయి భీమన్న ఆధ్యాత్మిక చింతన | - డా॥. కొత్తిరెడ్డి మల్లారెడ్డి | 137 |

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 2, February 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# 'గుడిసెలు కాలిపోతున్నై - సామాజిక దృక్పథం

- డా॥. జరుపుల రమేష్, హెడ్ & అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఎస్.ఆర్. & బి.జి.యన్.ఆర్,
ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, ఖమ్మం.

'నా కావ్యాలలో దేన్ని ఎక్కడ తెరిచినా
గంటెడు ఓదార్పైనా లభించక పోదు
గుక్కెడు మధువైనా దొరక్కపోదు'' అంటూ నినాదం చేసి ప్రపంచానికి, సాహిత్యం పట్ల సామాజిక దృక్పథం కలిగిన వ్యవస్థకు ఓదార్పును ఇచ్చిన భారతీయ కవి బోయి భీమన్న.

'ఏదీ నమ్మకండి, ఎక్కడ చదివినా సరే, ఎవరు చెప్పినా సరే
ఆఖరుకు నేను చెప్పినా సరే
అది మీ తర్కానికి, మీ లోక జ్ఞానానికి అంగీకారమైతే తప్ప' అని గౌతమ బుద్ధుడు అన్న మాటలు నిజానికి భీమన్న జీవితానికి సరిపోతాయి. భీమన్న తాను నమ్మిన వ్యవస్థ కోసం, ప్రజల కోసం పాటు పడిన ఆదర్శమైన వ్యక్తి. యువ సంపద కలిగిన దేశం మనది. వాళ్ళను సామాజిక చైతన్యం చేయడం కోసం 'జనరేషన్ గేప్ అంటే ఇదీ. యువకులు ముందుకుపోవడం అంటే ఇది. ఏభైయేళ్ల నాటి యువకుల్లో గల అట్టి అభ్యుదయ భావాలు, కార్యదీక్ష, ధైర్య సాహసాలు ఈ నాటి యువకుల్లో వున్నాయా?' అన్న మాటలను ఆధారంగా చేసుకొని భీమన్న గారు సాహిత్యం ద్వారా ఇచ్చిన స్ఫూర్తితో నేను ఈ వ్యాసాన్ని రాయడానికి ప్రయత్నం చేశాను.

"If there is no struggle, there is no progress. I am lighthouse rather than lifeboat. I do not rescue, but instead help others to find their way to shore, guiding them by my example. The happiest people I know are those who lose themselves in the service of others".

బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప భారతీయ కవి. సమాజం 'అంటరాని తనాన్ని' విశ్వవ్యాప్తం చేసి ప్రచారం చేస్తూ, ప్రజలను సమాజానికి దూరం చేస్తున్న తరుణంలో ఒక మారుమూల పల్లెలో 1911 సెప్టెంబరు 19 న తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో ఓ హరిజన కుటుంబంలో జన్మించాడు. వీరి తల్లిదండ్రులు నాగమ్మ, పుల్లయ్య. విచిత్ర మేమిటంటే ఏ సమాజం, ఏ గ్రంథాలైతే అంటరాని తనాన్ని ప్రచారం చేశాయో పుల్లయ్య వాటి ఆదర్శాలకు వెళ్ళి తనకు జన్మించిన ఐదుగురు కొడుకులకు (పంచ పాండవుల) పేర్లే పెట్టాడు. ఏ ధర్మానికి హరిజనులు అర్హులు కారో, ఏ విలువలను వారికి దక్కకుండా చేశాయో, అవి ఒక్కరి సొత్తు కాదు, ప్రపంచ సొత్తు అని భీమన్న గారి తండ్రి ఆశించి ఆ పేర్లు పెట్టి నిరూపణ చేశాడనిపిస్తుంది.

భీమన్న మారుమూల పల్లెలో జన్మించినా, ఏనాడు కృంగిపోలేదు. భారతీయ సమాజమే ఆధైర్యానికీ, సేవకు, విలువలకు, మానవతామూర్తిత్వం కలిగిన వ్యక్తికి 'పద్మ భూషణ్ అవార్డు ఇచ్చి గౌరవించడమే కాకుండా, సాహిత్యంలో తాను చేసిన కృషికి 'గుడిసెలు కాలిపోతున్నై' రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ' అవార్డు ఇచ్చి గౌరవించారు.

భారతదేశంలోని 'భిన్నత్వంలోని ఏకత్వం' లాగే, భీమన్న రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుందనీ, ఆయన కుల, మతాల కంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయ వాది అనీ ఆయన రచనలు చెపుతున్నాయి. భారత జాతీయ దృక్పథంలో అంతర్భాగంగా ప్రవహించే హిందూ మతంలో కులాన్ని ప్రత్యేకంగా విశ్లేషించు కోవాలి. అంబేడ్కర్ విశ్లేషించిందీ, భీమన్న వ్రాసిందీ కూడా అదే!

తన జీవితాంతం ఆయన జాతీయవాదిగానే ఉన్నాడు. జాతీయతలో తాను పుట్టి పెరిగిన దేశీయవాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే, ఆత్మగౌరవంతో జీవించాలనే ఆకాంక్షను ఎలుగెత్తి చాటాడు.

భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' రచనను 1973 సంవత్సరంలో వెలువరించారు. ఇందులో 57 కవితలు ఉన్నాయి...గుడిసెలు కాలిపోతున్నై ప్రధాన శీర్షికతో పాటు ఇతర మూడు రకాలైన అంశాలతో కూడిన కవితలు ఇందులో ఉన్నాయి. వాటిలో 'అమ్మో దున్నలు! దున్నలు!' 'పాపం ప్రజలు' 'మారని వాడు'. ఈ మూడు ఎందుకు చేర్చాల్సి వచ్చిందో ఈ పుస్తక పీఠికలో చెప్పుకున్నాడు.

"కేవలం సాంఘిక, మత, రాజకీయ విమర్శకు సంబంధించిన రచనలను మాత్రమే ఈ సంపుటిలో చేర్చాలని మొదట అనుకున్నాను. దీనికి 'గుడిసెలు కాలిపోతున్నై' అనే పేరు పెట్టిందందుకే. అయితే నేను అనుకొన్నదొకటైతే, జరిగిందొకటైంది. నాదొక విచిత్రమైన మనస్తత్వం. వంద పేజీల పుస్తకం ప్రెస్‌లో ఇస్తే అది ప్రెస్ నుంచి బైటికి వచ్చేటప్పటికి రెండువందల పేజీలవు తుంది. ఈ గ్రంథం కూడా అలానే పెరిగింది. 'అమ్మో దున్నలు' కవితను చేర్చమన్నారు కొందరు మిత్రులు. 'వాల్మీకి వనితఅయి వుంటే' కవిత లేకపోతే ఎలా అన్నారొకరు. 'రసాద్వైత్వం?' గుర్తుచేశారొకరు. 'మారని వాడి మాట?' అన్నా రింకొకరు" (ముందుమాట. 09) అని ఇందులో చేర్చడానికి కారణాలు చెప్పుకున్నారు.నేను మాత్రం కేవలం 'గుడిసెలు కాలిపోతున్నై' పరిధిలోనే కవితలను తీసుకొని ఈ వ్యాసాన్ని రాయడం జరిగింది.

భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' రచనను 1973లో రాసినా దేశంలో 1975 రానున్న 'ఎమర్జెన్సీ'ని ముందుగానే పసిగట్టాడనిపిస్తుంది. బహుశా అందుకే నేమో తన చిన్న తనంలో అటువంటి సంఘటనలు చూసినా, సరైనా సమయంలో దాన్ని వెలువరించారు.

## గుడిసెలు కాలిపోతున్నై - ప్రాపంచిక దృక్పథాలు

వినీలాకాశంలో పాఠకుడు కవి హృదయంతో సమానమైన హృదయం కలవాడుగా ఉండాలని ఆలం కారికులు చెబుతారు. నిరంతర కావ్య పరిశీలన వలన కావచ్చు, విభిన్న ప్రపంచ సాహిత్య పరిశీలన వలన కావచ్చు. తద్వారా అతని హృదయం విశలమవుతుంది.

'యేషాం కావ్యానుశీలనవశా ద్విశదీభూతే మనో ముకురే

వర్ణనీయ తన్మయీ భవన యోగ్యతా

తే హృదయసంవాద భాజః సహృదయాః' అని అభినవ గుప్తుడు నిర్వచించాడు. సహృదయత్వం లేనివాడు రసాస్వాద యోగ్యుడు కాలేడని అర్థం. అలంకారికులు చెప్పినట్లు భీమన్న సాహిత్యం అర్థమవాలంటే భారతీయ సాహిత్య దృక్పథాలు, ప్రాపంచిక కోణాలు ముందుగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాహిత్యంలో ప్రధానంగా రెండు విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. 1. మన కవులను ఏ కోణంలో చూస్తున్నామూ? 2. కవులు రాసినటువంటి రచన ఆధారంగా దాన్ని పరిధిలో కవిని చూస్తున్నామా? ఈ రెండు విషయాలను దృష్టిలో పెట్టు కొని, ప్రాంత పరిధి, జాతీయ పరిధి, ప్రపంచ పరిధిలో కవులను చూడాల్సిన అవసరం ఉంది. ఈ దృష్టి కోణంలో చూస్తే భీమన్నది ప్రపంచ పరిధి కల్గిన సాహిత్యంగా గుర్తించాలి. భీమన్న తన రచనల్లో ఈ విషయాన్ని కూడా చెప్పాడు. నేను ఇప్పుడు ప్రజలకు అర్థం కాకపోవుచ్చు. వేరుగా అర్థం కావచ్చు అనడంలో ప్రధాన ఉద్దేశం పాఠకులు భీమన్నను చూసే దృష్టి కోణమే కారణం.

"కవి అవగాహన, సంస్కారం, కళాత్మక దృష్టి పాఠకుడి అవగాహనతో సంస్కారంతో కళాత్మకతతో ఏకీభవించాల్సిన పనిలేదు. పూర్తిగా ఏకీభవించడమూ అసాధ్యమే. ఏ పాఠకుడికైనా తన జీవితానుభవం, ప్రపంచ పరిశీలన, హృదయ ధర్మం, సిద్ధాంత పరిచయం మొదలైన వాటిని బట్టి ఒకానొక ప్రాపంచిక దృక్పథం ఏర్పడుతుంది. ఇది వ్యక్తిగత దృక్పథం. ఈ దృక్పథాన్ని విడిచి పాఠకుడు ఒక రచనను అనుశీలించలేడు. అంటే పాఠకుడు ఒక రచనను ఎంత వస్తుగత దృష్టితో చూస్తాడో అంతే వ్యక్తిగత

దృష్టితోనూ చూస్తాడని గమనించాలి" అని పాపినేని అన్నారు.

కాబట్టి, పాఠకుడి వ్యక్తిగత దృక్పథం కేవలం సాహిత్యానికి మాత్రమే పరిమితమైంది కాదు. అనేక అంశాలకు లోబడి ఉంటుంది. ఈ రోజు భీమన్న సాహిత్యం కూడా దానికి లోబడే ఉంటుందని మనం చెప్పుకోవాలి. కారణం పాఠకుడే రచనను విశ్వవ్యాప్తి చేస్తాడు. కాబట్టి సాహిత్యాన్ని పరిశీలించడానికి సాహిత్యానికి మాత్రమే పరిమితమైన ప్రమాణం గానీ, దృక్పథం గానీ, సిద్ధాంతం గానీ ఉండవు. అది జీవితంతో ముడిపడి ఉంది.భీమన్న సాహిత్యాన్ని పరిశీలించడానికి విశాలమైన ప్రాపంచిక దృక్పథం ఉండాలి తప్ప సాధారణ దృష్టికోణం సరిపోదు. అందుకే నేను అతనిని 'ప్రాపంచిక దృక్పథం' కలిగిన కవిగా అభివర్ణిస్తున్నాను.

## సామాజిక దృక్పథం

"For successfull revolution it is not enough that there is discontent. what is required is a profound and thorough conviction of the justice, necessity and importance of political and social rights"

***- Dr. B.R. Ambedkar***

"Virtue, by definition, is the moral excellence of a person. Morally excellent people have a character made-up of virtues valued as good. They are honest, respectful, courageous, forgiving, and kind, for example... Virtues need to be cultivated to become more prevalent in life" భీమన్న కూడా సామాజిక ధర్మమే కోరుకున్నాడు. వాటి కోసం పరితపించాడు. దానిని సాధించడానికి తనకున్న శక్తిని ఉపయోగించాడు. అందుకు ప్రపంచాన్ని తన వెంట నడిపాడు. అందరూ కలిసి నాటుకుపోయిన రుగ్మతలను పారదోలుదాం అన్నాడు. దానికోసం ఎలా రాశాడో కవితలను పరిశీలిద్దాం.

భోయి భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' కవితలో "గుడిసెలు కాలిపోతున్నై /ఓహో, కాలిపోతున్నై /ఎవరి గుడిసెలు, పాపం!/మాల మాదిగలవే అయివుంటై/ గుడిసెలు మరెవరికుంటై?/చాలా మందికే వుంటైలే / అసలు ఈ దేశ ధర్మమే అంత!/అయితే - ఈ గుడిసెలు / ఏడాది కొకసారైనా కాలిపోతుంటై! / ఒకసారి కాలిపోయిన గుడిసెలు /మరి మళ్ళీ కాలిపోవడానికి / ఎక్కడి నుంచి వస్తుంటై? / అవును - నిజమే! / ఎక్కడి నుంచి వస్తుంటై?" (పుట: 01)

గుడిసెల్లో పుట్టి, గుడిసెల మధ్య పెరిగిన భీమన్నకు గుడిసెలు ఎందుకు కాల్తాయి. ఆ గుడిసెల స్థానంలో వేరే గుడిసెలు ఎలా లేస్తాయి మొదలైన విషయాల పట్ల అవగాహన ఉంది. భీమన్న చిన్నప్పుడు స్కూల్లో చదువుతున్నప్పుడు పక్కన హరిజన గుడిసెలు కాలిపోతున్న సందర్భంలో నేరుగా వెళ్ళి వాటిని ఆర్పిన అనుభవమే ఈ రచనకు మూల నేపథ్యం.

ఎందుకు మాల మాదిగల గుడిసెలు కాలిపోతాయి? వాటి వెనుక ఉన్న తాత్త్విక కోణం ఏమిటి? ప్రపంచంలోనేనా? లేక మన దేశంలోనా? ఎవరి గుడిసెలు కాలిపోకుండా వీరివే ఎందుకు కాలిపోతాయి? ఇప్పుడేనా? తరతరాలుగా కాలిపోతున్నాయి? అనే ప్రశ్నలు ఈ సమాజానికి అందించాడు కవి. వీటికి సమాధానం నిచ్చెనమెట్ల వ్యవస్థలో పాతుకుపోయిన 'కులం' అని చెప్పవచ్చు.

"కుల వ్యవస్థ అందరికీ ఒకే విధంగా వర్తించే కార్యరంగాన్ని నిరోధిస్తుంది. తద్వారా హిందువులు తమదైన సామాన్య జీవన విధానం, చైతన్యాలతో ఒక సమాజంగా ఏర్పడకుండా నిరోధించింది. వ్యక్తులు ఎవరికి వారుగా మొత్తం పనిలో తమ వంతు పని చేసే వారుగా విడివడి వుండటానికి మాత్రమే అది అనుమతిస్తుంది" అని డా. బి.ఆర్. అంబేద్కర్ అన్నారు.

ఇందులో ఉన్న అంతర్యం చూస్తే... హిందూ కుల సమాజంలో వైరుధ్యాలు ఎన్ని వున్నా ప్రజల మధ్య లోతైన సాంస్కృతిక ఐక్యత ఉంది. అలా ఉన్నప్పుడు మిగితా

విషయాల్లో సాంస్కృతికంగా ఒకేతాటి పై ఉండగలరు. తద్వారా అనేక సమస్యలు సమసిపోతాయి. ఈ సామాజిక ధర్మమే ఈ గుడిసెలు కాలిపోతున్నాయి. వీటిని ఆపడానికి దేశం నలుమూలల నుండి చైతన్యం వస్తే సరిపోదు. చైతన్యం రావాల్సిదే సామాజిక ధర్మంలో. సామాజిక ధర్మంలో చైతన్యం రానంతవరకు ఈ గుడిసెలు ఇలాగే కాలిపోతుంటాయి.

'అదే మన ధర్మంలోని రహస్యం / ధర్మ సంస్థాపనార్థం ఈ గుడిసెలు/మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై!/ పోతుంటై/ పుట్టుకొస్తుంటై!/ ఈ విషవలయం సాగడం ఎంత వరకు/ రహస్యం గుడిసెల వాళ్ళకు తెలిసేవరకు!" (పుట:1,2)

హిందువులలో వెనుకబడ్డ శ్రేణుల వర్ణ వ్యవస్థ వలన ప్రత్యక్ష కార్య చరణకు పూనుకోలేపోయారు. ఎందుకంటే ఆ వ్యవస్థ వారిని పూర్తి స్థాయిలో వైకల్యానికి గురి చేసింది. కాని సమాజం అట్టడుగున వున్న వెనుకబడ్డ జాతులు తాము వున్న స్థితి నుండి తప్పించుకునే మార్గం లేక, తప్పించుకోడమెలాగో తెలియక నిరంతర దాస్యంతో రాజీపడ్డాయి. ఏ వ్యవస్థ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారో ఆ ధర్మాన్ని, ఆ రూపాన్ని భీమన్న ఈ కవిత ద్వారా మన కళ్ళ ముందు ఉంచాడు. విశాలమైన దృష్టికోణంతోనే 'అదే మన ధర్మంలోని రహస్యం' అనే పంక్తులను వాడాడు.

ఈ దేశంలో గుడిసెలకు కేరాఫ్ అడ్రస్ మాల మాదిగలేనా! లేక ఈ దేశమే గుడిసెలకు కేరాఫ్ అడ్రస్ అని భావించవచ్చునెమో! ఎవరి మనస్సులో 'వికసించిన చైతన్యం', 'శ్రామిక చైతన్యం', 'వలస చైతన్యం' పట్ల అవగాహన ఉండదో వాళ్ళందరూ గుడిసె వాసులే అని భావించవచ్చు. కానీ, ఇక్కడ పేదరికంతో జీవితాన్ని గడుపుతున్న మాల మాదిగలు ఆ గుడిసెల్లో ఉన్నంత వరకు సామాజిక ఎదుగుదల, అభివృద్ధి ఫలాలు పొందలేరు. నిత్యం వాళ్ళు పేదరికాన్ని అనుభవించాలే కాని, వాటి నుండి బయటపడటానికి ఈ సమాజం అవకాశం ఇవ్వడం లేదు. ఒకవేళ వాళ్ళు ఆ వ్యవస్థ నుండి బయటికి రావడానికి ప్రయత్నిస్తే అటువంటి అవకాశం ఈ సమాజం కల్పించడం లేదు. దళితులు అభ్యున్నతిని కాంక్షించకుండా, వారు ఏ పేదరికంలో ఉన్నారో, ఏ గుడిసెల్లో జీవనాన్ని గడుపుతున్నారో అక్కడే ఉంచి, దాని చుట్టూ బయటికి రాకుండా ఈ సమాజం 'విషవలయం' సృష్టించిందని పరోక్షంగా నిందిస్తారు. సమాజంలో మనమే అవకాశాన్ని సృష్టించుకోవాలి. కాలిపోతున్న గుడిసెల స్థానంలో మరో గుడిసెను కాకుండా భవనాలు లేపు కోవాలని, ఆధునిక భావాలను నూతనంగా ఆలోచింప చేశాడు భీమన్న. వాటి నుండి కొత్త ఉషస్సులు, ఉగాది పుట్టుకు రావాలని ఆదేశిస్తున్నాడు. పాతది పూర్తిగా సమిసి పోకుండా కొత్తది తేవాలనే 'వలస చైతన్యాన్ని' అభ్యుదయ కోణంలో కవి ఆశిస్తున్నాడు. అంటే సాహిత్యంలో భీమన్న నూతనంగా 'వలస చైతన్యాన్ని' ఆశించాడు. ఒక గుడిసె స్థానంలో మరొక గుడిసె మళ్ళీ మళ్ళీ ఆవిర్భావించడంలో సంచారిక జీవనాన్ని తెలిపాడు.

'మానవుడంటే ఒక జంతువు / మతం అంటే ఒక రకం పిచ్చి / ఒకొక జంతువుకి ఒకొక పిచ్చి/ మానవుడికి మత పిచ్చి/ హిందువుడికి అదనంగా / ఒక విశ్వ సమన్వయ పిచ్చి" (మతం ఒక పిచ్చి. పుట:08)లో చెప్పాడు. వాస్తవానికి పీఠికలో " మానవులను నేను మూడు తరహాలుగా విభజిస్తున్నాను. 1. పులులు 2. నక్కలు 3. గొర్రెలు" అని (పుట:12) వివరించాడు.

"సమాజానికి మతం అవసరం లేదని కొంతమంది అనుకుంటారు. కాని నేను దీంతో ఏకీభవించబోను. మతం, దాని పునాదులు మానవ జీవితానికి సమాజపు కట్టుబాట్లకు, ఆచార వ్యవహారాలకు అత్యవసరమైన వన్నది నా భావన" అని అంబేద్కర్ అభిప్రాయ పడ్డాడు.

కానీ, ఆధునిక కాలంలో దీని ప్రాముఖ్యత మరింత పెరిగింది. మంచి కంటే చెడుయే ఎక్కువగా ఉంది. ఎక్కడికైనా వెళితే ఏ కులస్తుడు అనే ప్రశ్నతో పాటు ఏ మతస్తుడు అనే ప్రశ్నలు విరివిరిగా ఎదురౌతున్నాయి.

అందుకే దీన్ని అంతంలోనే అరికట్టాలనే కవి కోరిక నేటికీ నెరవెరలేదు. వ్యవస్థలో ఉన్న దుర్మార్గాన్ని మాత్రం నేటి ప్రజలు ముందుగానే గ్రహించగలిగారు! అందుకే కవి పైన వివరించిన మూడు రకాలైన మనుషులను చెప్పడంలో అర్థం కూడా ఇదే. జంతువులకు పులులకు, నక్కలకు, గొర్రెలకు లేని కులం, మతం మనుషులకు ఎందుకు అని విమర్శంచాడు. ప్రకృతిలో సాధారణంగా పులిని చూసి నక్కలు భయపడడం, నక్కను చూసి గొర్రెలు భయపడడం సామాజిక ధర్మం. కానీ ఇదే ధర్మం మానవుల్లో ఎందుకు అని కవి ఆశ. తెలియకుండానే చాలా ప్రబలంగానే నాటుకుపోయింది.దాన్ని నిర్మూలించడమే ప్రధాన ధ్యేయం అంటూ ఇలా అంటాడు.

"ఓరి, మూర్ఖుడా, మతం విషం రా, విషం / నల్ల మందన్నాడెవడో, అది అబద్ధం/ మతం విషం, ఆత్మనే చంపుతున్న విషం/ నానా విషాలు కలిపిన కషాయం/ అమృతం అవుతుందా, బాబూ?/ నీ నానామత సమన్వయ ప్రయత్నమూ అంతే/ అది విషం, దాన్ని సాంతం నిర్మూలించి పారెయ్" (పుట:9)

మనిషిని స్వతంత్రమైన నైతిక జీవనానికి అనుర్హుడుని చేసి, సమాజం విధించిన నిబంధనలకు కట్టుబడి మనిషి జీవించేలా చేసే ఈ మతాన్ని నాశనం చేయాలని కవి ఆలోచన. మన హిందూ ధర్మంలోని మతం అనే పేరుతో చెలామణి అవుతున్నది మతం కాదనీ...అది ఒక కషాయం అని కవి భావించాడు. అందువల్ల సమాజం వెనుకబడడానికి కారణమైన వాటిలో బలమైనది మతమే అని, దాన్ని సర్వనాశనం చేయాలని ఆశిస్తున్నాడు. మతం పేరుతో చెలమణి అవుతున్న చట్టాలను రద్దు చేసి సమన్యాయం కలిగించాలని, లేదంటే జీవితంలో అమృతం అని చెప్పి అందులో విషం కలిపే వాటిని పసిగట్టాలనీ, లేదంటే 'నానా విషాలు కలిపిన కషాయం'లాగే ఉండిపోతుందని ఆవేదన చెందుతాడు. వాటినే ఈ కవితలో వివరించాడు.

**తాత్త్వీక కోణం**

"The oppressed are allowed once every few years to decide which particular representatives of the oppressing class are to represent and repress them" (Karl Marx) అన్నారు. కార్ల్ మార్క్స్ అన్నట్లు అణిచివేతకు గురవ్వడానికి తాత్త్వీక కోణాలు కూడా ప్రధానమైన కారణం. తాత్త్వీక విధానంలో జీవన సారం దాగి ఉంటుంది.వాటి వెంబడి ప్రజలు తిరుగుతుంటారు. ఆ బరువును మోసుకుంటూ వెళ్తారు. దాన్ని భీమన్న కూడా చాలా చక్కగా వింగడించారు.

భీమన్న రాసిన 'కాల్తీ రాజ్యపు దేవుడు గారు' అనే కవితను చూస్తే " దేవుడు గారా, నమస్కారం!/ మస్కా కదండీ, నమస్కా / ఆ తర్వాత 'రం' వుంది లెండి/ రండి, కూర్చోండి" (పుట:3) అంటూ తాత్త్వీక కోణాన్ని ఆవిష్కరింపజేశాడు. భీమన్న ఈ కవితలో సర్వ మతాల సారాంశం ఒక్కటే నన్నట్లు అందరిని ఒకేచోట చేర్చాడు. 'చక్రం, శూలం, శిలువ, చంద్రవంక / నామం, విభూతి, పిలక, గెడ్డం/ గళ్ళులుంగీ, నెక్ టై, దొర టోపీ/ అదేం వేష మండోయ్, బాబు / విశ్వమతోన్మాదు లందరికీ / ఏకైక ప్రతినిధా ఏమిటి మీరు?" (పుట:04) ఈ కవిత టైటిల్‌లోనే చాలా గమ్మత్తైనా అర్థాలు గోచరిస్తాయి. కొన్ని శతాబ్దాల అణచివేత కనిపిస్తుంది. ఈ దేశంలో మతం ముసుగులో, దేవుడు పేరు చెప్పి చేసే మోసాలు ఎన్నో. ఆ కోణం బలంగా ఈ దేశంలో నాటుకుపోయింది. నాటుకోపోయిన ఆ కాల్తీ దేవుళ్ళను తరిమేద్దాం. నిజమైన వాటి కోసం అందరూ కలిసి వెతుకుదాం.దాన్ని సాధించడం కోసం అందరూ కలిసి పోరాడుదాం అనే లౌకిక సత్యాన్ని చెప్పడంలో కవి యొక్క గొప్పతనం కనిపిస్తుంది.

విశ్వాన్ని నేడు శాసించే కోణాన్ని విప్పి ప్రక్షాళన చేయాల్సిన సమయం ఎంతో దూరంలో లేదు. నేడు అన్ని విధానాలు ఒకేచోటు చేరాల్సిన సమయం ఆసన్నం అయింది. అందుకే ' మా జాతీయ పిండివంట రెడీగా వుంది/ కొంచెం అరగించి వెళ్ళండి' అంటూ సమైక్యతను చాటుతాడు.

మరొక కవితలో ' కులమతాలకు ఉమ్మడి కాష్ఠం' లో జీవన సత్యాన్ని ఆవిష్కరిస్తాడు.''క్షణం ముందు వరకూ/ అదొక కోట్ల విలువైన మహా విమానం/ ఇప్పుడది వట్టి మసి, మట్టి!/ అందులోని ప్రయాణికులు/ కోటీశ్వరులు, కుబేరుని వారసులు/ ఇప్పుడు వట్టి పీనుగు పెంటలు" (పుట:13) ఈ దేశంలో డబ్బు,హోదా, కులం, మతం అన్ని వీర్రవీగే చోట చివరికి తాను చేరాల్సిన ప్రాంతాన్ని చాలా గొప్పగా ఈ కవితలో చిత్రించాడు. నేడు కరోనాతో ప్రపంచం అంతా ధనిక, పేద లేకుండా ఎటువంటి మరణాలను చూశామో కవి కొన్ని దశాబ్దాల ముందే మనకు అటువంటి దృశ్యాన్ని ఒక విమానం కూలిపోయిన సంఘటన రూపంలో చిత్రించాడు. "స్త్రీలు, పురుషులు, బాలలు, వృద్ధులు / హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు/ మంత్రులు, ఉద్యోగులు, వ్యాపారులు, చారులు/ క్షణం ముందు వరకూ ఎన్నో రకాల వాళ్లు / ఇప్పుడందరూ ఒకే రకం కళేబరాలు / జాతి వృత్తి మతాతీత మాంసపిండాలు'' (పుట:13) ప్రపంచం యొక్క గోప్యతను చెప్పాడు. జీవితాన్ని ఎంతో చక్కగా అవగాహన చేసుకుని ముందు చూపును ప్రదర్శించాడు. ఇటువంటి సంఘటనలు నిత్యం జరుగుతుంటాయి. కానీ, వాటిని ఒకే చోట చేర్చి 'సమానత్వం' కావాలని కోరడం అభ్యుదయ భావాన్ని కోరుకున్నాడు కవి. మన అంతర్గత శక్తిని ఎంత ఎక్స్‌ప్రెస్ చేస్తే అది అంతగా సృజనాత్మకతకు దారితీస్తుంది.

ఇక కవి యొక్క అసలైన కోణాన్ని చూస్తే ...కులం మెడలో వేసుకుని తిరిగే వ్యక్తుల మధ్య, కోట్లకు వారసులని చెప్పుకునే వారికి 'ఇప్పుడందరూ ఒకే రకం కళేబరాలు' అనడంలో ఎంతో జీవన సత్యం దాగి ఉంది. ఇక్కడ కులం లేదు, మతం లేదు. అందరూ ఒకే రకం కళేబరాలు ఉన్నాయి. కళేబరాలు నాది ఏ కులం అని అడగడం లేదు, నన్ను కేవలం మా జాతి, మా కులం వాళ్ళే చూడాలనే వాదనను కూడా అక్కడ చెప్పడం లేదు. కాబట్టి ప్రపంచం ఇటువంటి దృష్టికోణం లేకుండా ఉండకూడదని, విశాలదృక్పథం కలిగి 'కులం' అనే జాఢ్యాన్ని వదలాలనే భావనను ఈ కవిత ద్వారా వివరించాడు.

నేడు జరుగుతున్న ఈ పరిణామాలకు కారణం ఎవరూ? జీవితంలో మౌలికమైన అంశాలను, ప్రక్రియలను పవిత్రీకరించడం ద్వారా వాటి పరిరక్షణకు సమాజం బాధ్యత వహించాలి. అప్పుడు సమాజం విధించిన నియమ నిబంధనలను కూడా అది పవిత్రీకరిస్తుంది. కులం, మతానికి మధ్య గల నైతికత సంబంధాన్ని కవి చెప్పాడు. సమాజంలో సమానత్వం ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే ప్రపంచ మానవుడిది ఒకటే కులం, ఒకటే మతం. మనుషుల్లో తేడాలు లేవు. కాలమే తమ అవసరాల కోసం వాటిని సృష్టించిందనే భావాన్ని చెప్పాడు. 'ఏది ముఖం, ఏది నడుం, ఏది కాలు, ఏది చేయి' అనే పంక్తుల్లో చాతుర్వర్ణ వ్యవస్థ కనిపిస్తుంది. మనిషి ఎలా పుట్టాడో మనువు చెప్పిన వాక్యాలు మనందరికీ తెలిసిందే. కానీ మరణంలో అందరూ ఒకేచోట కలిసిపోయారు. అందరూ సమానులే అనే అంతిమ జ్ఞానాన్ని ఈ సమాజం గ్రహించాలనే లౌకిక రాజ్య భావనను కవి ఆశిస్తున్నాడు.

అందుకే 'భగవంతుడొక కొట్టిన పిండి' కవితలో "దేనికైనా, బ్రహ్మజ్ఞానే సమర్థుడు, స్వామీ/ బ్రహ్మజ్ఞాన సంపన్నుడికి / భగవంతుడొక కొట్టిన పిండి/ దానితో అతడు పకోడీలు వండుకు తినవచ్చు'' (పుట:15) నేటి అగ్రవర్ణ వ్యవస్థ చేసే పనిని తెలియజేశాడు. ఉన్నత వర్గాల్లో కొన్ని కులాల వాళ్ళు మాత్రమే ఈ రాజ్యాన్ని నడుపుతున్నారు. సామాన్యుడు, దళితుడు, గిరిజనులు వాళ్ళను భుజం పై మోస్తున్నారు. దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతుల వాళ్ళు కూడా రాజు అయ్యే కాలం ఎప్పుడొస్తుందో చూడాలి. భగవంతుడు అనే వాడు ఉన్నాడో లేడో? తెలియదు కానీ, ఆధునిక కాలంలో మాత్రం ఆ జ్ఞానం ఉంటే ఎక్కడైనా తన మాటల ద్వారా బతికెయ్యవచ్చు. మిగతా వాళ్ళు శ్రమ చేసినా కూడా

బతకలేని తరుణం ఉన్న ఈ దేశంలో మార్పు ఎప్పుడొస్తుందోనని ఆశిస్తున్నాడు కవి.

'నా వారసత్వపు హక్కులు' కవితలో "విశ్వాన్నే ఆర్యం చెయ్యాలనుకొని/ తాను కులంలేని వాడైనా బ్రహ్మర్షి అయి / నమ్మదగ్గ భార్య కోసం/ నానా దేశాలూ వెతుకు తున్న వశిష్ఠుడికి/ ఆ మాల మాదిగ పిల్ల అరుంధతే దొరక్కుండావుంటే" (పుట:06) ఈ కవితలో నిజాన్ని బద్దలుకొట్టిన విధానం కనిపిస్తుంది. ఈ దేశంలో నేను కులం అనే పదం వల్ల ఈ సమాజానికి అంటరాని వానిగా ఉన్నానో, ఏ వ్యవస్థ నన్ను నాగరిక సమాజానికి దూరం చేసిందో, ఏ వ్యవస్థ నన్ను మనుషుల్ని తాకనీయకుండా చేసిందో వాటన్నింటికి సమాదానం వాటికి సమాధానాన్ని చాలా సున్నితంగా కవి ఈ కవితలో చిత్రించాడు. ఆ నాడు అరుంధతి లేకపోతే అనే ప్రశ్నను ఎవరు వేసు కోవాలి? సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉంది.

కవి అక్కడితో ఆగిపోకుండా తన అస్తిత్వాన్ని ఇలా అంటున్నాడు. "ఆర్య జాతి వ్యక్తిత్వానికే ఆదిపురుషుడు/ వ్యాసుడు మాలమాదిగ వాడే కదా? ఈ నాడు అతడు అగ్రవర్ణం వాడు/ అతడి వంశం వాణ్నినేను అంత్యజుణ్ని/ ఇదే మన భారతీయ సమాజ ధర్మం/ నేటి దాకా సాధించిన పురోగమనం"(పుట:07) నిక్కమైన నిజాన్ని చరిత్రలో ఎలా దాచారో వివరించాడు. వారికి ఒక న్యాయమా!, మాకు ఒక న్యాయమా! కాదు, కాకూడదు. అందరికి ఒక్కటే న్యాయం కావాలి. చరిత్ర అందరికి సమానమే. చరిత్రను మార్చకూడదు. నిజాన్ని స్వీకరించే గుణం ఉంటే చాలు. మేము ఆ వారసులమే నని వారి హృదయంలో ఉంటే చాలు. ఆర్యజాతి మేమే మూల పురుషులనే నిజం కఠినంగా ఉండవచ్చు కానీ, ఏదో ఒక రోజు వారి చేత పుస్తకాలు రాసే రోజు ఎంతో దూరం లేదు, అతి తొందర్లోనే ఉందనే భావనను తెలియజేశాడు. అందుకే కవి "వీటిని త్రవ్వి తీసి/ ఇవి నావని ప్రపంచానికి చూపి/ ఆ తర్వాత, గర్వంగా అవతల పారేస్తాను/ ఠీవితో తలెత్తుకు తిరుగుతాను"(పుట:7) అంటూ సగర్వంగా తాను ఏ వంశ వారసుడో వివరంగా చెప్పాడు. సమాజం దాచిన నిజాన్ని, సమాజమే ఈ ప్రపంచానికి చాటి చెప్పాలి.

"మన కంటికి కనిపించే బాహ్య వాస్తవికతకీ సాహిత్యంలో కన్పించే వాస్తవికతకీ స్వభావంలో తేడాలు లేకపోయినా, అవి రెండూ వేర్వేరు. నిజానికి సాహిత్యంలో కన్పించేది వాస్తవ ప్రతిఫలనమేగాని కేవల వాస్తవం కాదు. అదే సమయంలో అది అవాస్తవం లేదా మిథ్య కాదు. ఈ వాస్తవానికీ వాస్తవ ప్రతి ఫలనానికీ వున్న భేదాన్ని కళాత్మకం నిర్ణయిస్తుంది" (పాపినేని. పుట: 21) అన్నాడు. అందుకే కవి తలెత్తుకు తిరుగుతాను' అనే ధైర్యాన్ని ఈ సమాజానికి విసిరాడు. దాన్ని స్వీకరించే ధైర్యం కావాలి! ఆ ధైర్యాన్ని నేనే నని, అందుకు తలెత్తుకు తిరుగుతాను' అని తన కవితా వారసత్వాన్ని ఈ సమాజాన్ని అందిచాడు కవి. హెన్రీ అన్న మాటలు చూస్తే... "It can not be necessary to prove to anybody who reads this work that ideas govern the world, or throw it into chaos, in other words, that all social mechanism rests upon opinions" భీమన్నకు సరిపోతాయి. కాబట్టి నిజం నిరూపించడానికి ఎవరి దగ్గర కెళ్ళవలసిన అవసరం లేదని సత్యాన్ని గ్రహించాలని అర్థమౌతుంది.

## డెమోక్రసీ - మేము - నా అస్తిత్వం :

" The democracy will cease to exist when you take away from those who are willing to work and give to those who would not" (Thomas Jefferson)

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం.భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం.అనేక మతాలకు, కులాలకు నిలయ స్థానం. ఇంత పెద్ద దేశాన్ని నడిపే హక్కు సామాన్య ప్రజల ఓటు హక్కు. ఆనాడు బి.ఆర్. అంబేద్కర్ ఎంతో కష్టపడి రాజ్యాంగంలో అందరికి ఓటుహక్కును కల్పించాడు. ఈ దేశంలో 'నేను అనే ధోరణి నుండి నా వరకు స్వార్థం చేరిపోయి కుటుంబ పాలన వరకు చేరుకుందనే భావన. కాబట్టి ఈ దేశంలో అస్తిత్వం కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అందుకే కార్ల్ మార్క్స్ "Democracy is the road to socialism"

అని అభిప్రాయపడ్డాడు. భీమన్న ఈ కోణంలో చెప్పిన కవితలు ఇప్పుడు చూద్దాం.

'గుద్ది పారేస్తాం' కవితలో "అభ్యర్థి గారికి స్వాగతం/ గతం కాదండీ,మీకు మా / అదే నండి, అదే వోటు కాగితం/ మా వోటు కాగితాలన్నీ మీకే నండి/ మా అంటే గౌరవవాచకం కాదండి, బాబు/ అది బహువచనేం/ మీ ఏక వచనమే/ మా బహువచనం/ మీ రొక్కరు / మేం లక్షా పదివేల వోటు కాగితాలం/ మా వోట్లన్నీ మీకే నండి/ మా గుడిసెలన్నీ మీవే నండి/ మీరేం చెప్పక్కర్లేదు/ మీరు చెప్పదలిచిందంతా/ మాకు కంఠంతా గానే వుందండి/ మీ (ఎన్నికల) గుర్తా/ మీ గుర్తు తెలియక పోవడమేమిటి/ గుర్తుపట్టి గుద్దడమే గా/ ఓ, మా వాళ్ళకు తిక్కరేగాలే గాని/ ఒకే గుద్దడం గుద్ది పారేస్తారు/ ఇక వెళ్ళిరండి, బాబు!/ మేం ఇంకా గంజి కాచుకోలేదు" (పుట:2,3)

అంబేద్కర్ దృష్టిలో 'ఒక వ్యక్తి ఒక ఓటు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే దైనందిన వ్యవహారాల్లోనూ, ఒక నిర్దిష్ట సమయం ముగిసిన అనంతరం ప్రభుత్వ పనితీరును సమీక్షించే అవకాశం ఓటర్లకు కల్పించడం. భీమన్న దృష్టిలో కూడా ఓటు అంటే సామాన్యుడు గుద్ది పారేస్తారు' అనే ధోరణిని వ్యక్తం చేశాడు. ఇక్కడ ప్రధానంగా మూడు అంశాలను గమనించాలి. 1. ప్రజలు 2. ప్రాంతం 3. పేదరికం.

ముందుగా ప్రజలను పరిశీలిస్తే...ఓటు ఎటువంటి ప్రజలు ఉపయోగించుకుంటారు. సాధారణంగా ఓటు హక్కును అందరికి కల్పించడం జరిగింది. కానీ, ఈ దేశంలో అత్యధిక ఓటు హక్కును ఉపయోగించుకునేది పేదవాళ్ళే కొన్ని సర్వేలు చెపుతున్నాయి. ప్రజాస్వామ్యం అనేది ప్రభుత్వం యొక్క ఒక రూపం కాదు, సామాజిక సంస్థ రూపం. సానుకూల, సామాజిక వ్యవస్థ ప్రజాస్వామ్యం విజయవంతమయ్యేందుకు ముఖ్యావసరమని చెప్పవచ్చు. దీనికి ఆయుధం ప్రజలు. భీమన్న 'మా వాళ్ళకు తిక్కరేగాలే గాని" అనే పంక్తుల్లో ఈ దేశ అజ్ఞానం దాగి ఉంది. రెండోది ప్రాంతం. ఓటు హక్కుకు ప్రాంతం కూడా చాలా విలువైనది. ఏ ప్రాంతంలో ఎటువంటి ప్రజలు ఉంటారు! వాళ్ళ దగ్గర ఎటువంటి కల్తీ విధానంతో కూడిన మాటలు వాడాలో ఈ దేశంలో చాలామంది నాయకులు ముందే చదివేశారు. ఆ పుస్తకం ఎక్కడ దొరుకుతుందో ఇంతవరకు అడ్రాస్ తెలియలేదు. మీ గుర్తు తెలియక పోవడమేమిటి? అనడంలో వ్యంగ్యాత్మక ఉంది.

మూడోది పేదరికం. దీన్ని వెనుక ఉన్న అసలు రహస్యం పేదరికం. పేదరికం మనిషిని చాలా దూరం తీసుకెళ్తుంది. 'మేం లక్షా పదివేల వోటు కాగితాలం/ మా వోట్లన్నీ మీకే నండి/ మా గుడిసెలన్నీ మీవే నండి' అంటూ దేశంలో ఉన్న ఓటులో దాగిన పేదరికాన్ని తెలిపాడు. కాబట్టి మానవులు ఒక క్రమపద్ధతిలో సాగేలా నియంత్రించి వారిని ఒకరిగా కలిపి ఉంచే సామాజిక, ఆర్థిక, రాజకీయ విలువల రూపకల్పనతో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం, కల్పించే అవసరాన్ని పెంపొందింపచేసే జీవన విధానమే ఈ డెమోక్రసీ యొక్క ప్రధాన సిద్ధాంతం. అటువంటి విధానం కేవలం పేపర్ వరకే పరిమితం కాకూడదు. ఆచరణలో పెట్టాలి. దాని ఫలితాలను ప్రజల దాకా తీసుకెళ్ళ గలగాలి. అప్పుడుగాని 'ఓటు' విలువ మరింత పదునుగా తయారవుతుంది. కానీ ఇన్నేళ్ళ భారతదేశంలో ఓట్లు వేస్తున్నా అభివృద్ధి అనేది అక్కడే ఉండిపోయింది. భారతదేశ చరిత్రలో అస్పృశ్యులకు రాజకీయ ఉనికిని ఓటుహక్కు ద్వారా లభించింది.

'బానిసల జాబితా' కవితలో "ప్రభూ! మా పేర్లనూ/ వోటర్ల జాబితా నుంచి తొలగించి/ బానిసల జాబితాలో చేర్పించండి!/ చచ్చి మీ కడుపున పుడుతాం!/ బానిసల జాబితా అనేది ఇప్పుడు లేదంటారా!/ పూర్వం రాజుల పాలనలో వుండేదే!/ ఇప్పుడిది ప్రజల పాలన అంటారా!/ బానిసల జాబితా స్థానంలో/ వోటర్ల జాబితా వచ్చిందంటారా?/...ఆ వోట్లేవో మీ దొరలే వుంచేసుకోండి/ మా గుడిసెల్లో మమ్ము బ్రతక నివ్వండి/ మేం వెనకబడ్డ వాళ్ళం, బలహీన వర్గాల వాళ్ళం/ విలువైన దేన్నీ

కాపాడుకోలే...ఈ వోట్ల చెలగాట్లతో మమ్మల్ని చంపకండి/ దయచేసి జాబితా మార్చెయ్యండి''(పుట:12) ఈ దేశం లో దళితులు జీవనతత్వం కనిపిస్తుంది. భీమన్న ఉద్దేశంలో కూడా మా జీవితాలను రోడ్డుకు లాగకండి, దయచేసి మా బతుకులు బతకనియ్యండి అనే ధోరణిని కవి చెప్పాడు. అందుకే కవి మరొక కవితలో ఇలా అంటున్నాడు.

''ఈ మానవ లోకంలో/ ఒకొక్కడి కొకొక్క రోగం/ పైకి బాగానే కనిపిస్తారు/ లోపల ఏదో కుళ్ళు, ఏవో వుళ్ళు!''(పుట:23) ఆధునిక లోకం పోకడే ఇది. దీన్ని ఏనాడో భీమన్న ఈ కవిత ద్వారా విప్పి చెప్పాడు. అందుకే బోయి భీమన్న 'ప్రాపంచిక దృక్పథం' కలిగిన కవిగా, అభ్యుదయ భావాలు కలిగినవాడిగా, ఆదర్శమైన వ్యక్తిత్వం కలిగిన మనిషిగా మనకు ఈ కవితల ద్వారా కనిపిస్తాడు. ఇలా అనేక విషయాలు మిగిలిన కవితల్లో వివరించాడు.

## చివరగా...

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఎందుకు ఇప్పుడు భీమన్నను మళ్ళీ చదవాలి? అనే ప్రశ్న వేసుకుంటే "గత కాలం మేలు వచ్చు కాలం కంటెన్' నన్నయ అన్నారు. ఈ సమాజంలో దళితుల అభివృద్ధి ఎంతమేరకు ఉంది, నిజాంగా ఆ గుడిసెల నుండి బయటికి వచ్చి, అభివృద్ధి చెందారా! అంటే ఇంకా దూరంగానే ఉన్నారని చెప్పాలి. సరైన దిశలో ఫలాలు అందాల్సిన అవసరం ఉంది.

చివర భీమన్న ప్రాపంచిక సాహిత్య దృక్పథాన్ని "మనిషి యొక్క ఆనందం ఏదో ఒకటి పొందడంలో లేదు / కానీ తన కంటే గొప్పదైన ఒక పనికి తనను తాను అంకితం చేసుకోవడంలో ఉంది'' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ వాక్యాలు భీమన్న సాహిత్య కృషికి అక్షరాల సరిపోతాయి. కాబట్టి జ్ఞానం కలిగి ఉండడం వేరు, జ్ఞానం వల్ల రూపాంతరం చెందడం వేరు. జ్ఞానం అనేది సమాచా రాల సమాహారం. తన విశాలమైన జ్ఞానం ద్వారా ఈ ప్రపంచాన్ని నిద్ర లేపిన కవి భీమన్న. అట్టడగు వర్గాల వారికి ఒక వరాన్ని ప్రసాదించిన వ్యక్తి. తన కవితా శక్తి ద్వారా ఈ సమాజానికి ఎన్నో ప్రశ్నలు వేసి, తద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన, నిజమైన సామాజిక దృక్పథం కల్గించిన వ్యక్తి మన 'పద్మభూషణ్ బోయి భీమన్న'. భీమన్న సాహిత్యం ప్రపంచంలో ఏ గుడిసె కాల నంతవరకు సజీవంగానే బతికి ఉంటుంది. కుల మత జాఢ్యాలు వదిలే వరకు, మనుషుల్లో సమానత్వం వచ్చే వరకు, మనిషికి మనిషే కేరాఫ్ అడ్రస్‌గా మారేంత వరకు భీమన్న 'సాహిత్యం' సజీవమే....ఒక చైతన్యమే.

## ఉపయుక్త గ్రంథాలు :

1. ఆచార్య కాకర్ల వెంకటరామనరసింహం. 1982. ఆధునికాంధ్ర కవితా సమీక్ష, గంగాధర పబ్లికేషన్సు, విజయవాడ-2.
2. డా. పాపినేని శివశంకర్. 1996. సాహిత్యం - మౌలిక భావనలు. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
3. డబ్లు. ఎన్. కుబేర్. 2008. డాక్టర్. బాబాసాహెబ్. అంబేద్కర్ - విశ్లేషణాత్మక అధ్యయనం, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాదు.
4. బోయి భీమన్న. గుడిసెలు కాలిపోతున్నై. 1973.సుఖేలా నికేతన్, హైదరాబాదు.
5. రామ్‌దాస్. 2003. కారల్ మార్క్స్ జీవిత కథ. ప్రజాశక్తి బుక్‌హూస్, హైదరాబాదు.
6. Henry D.Aiken.1956.The Age of Ideology.New York,N.Y.:New American Library.